nipuna
Every Wednesday Free Supplement
05.
24 జనవరి 2024
పేజీలు 8

## టీఎస్‌పీఏకు సర్టిఫికెట్లు

రాజా బహదూర్ వెంకట రామిరెడ్డి తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ (టీఎస్‌పీఏ)కి మూడు అంతర్జాతీయ సర్టిఫికెట్లు లభించాయి. అకాడమీలో క్వాలిటీ ఎడ్యుకేషన్, ఎన్విరాన్‌మెంట్, ఫుడ్ సేఫ్టీ విభాగాల్లో అత్యుత్తమ ప్రమాణాలపై హైదరాబాద్‌కు చెందిన హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ డిసెంబర్ 14న అకాడమీ డైరెక్టర్ ఏఆర్ శ్రీనివాస్‌కు ఐఎస్‌వో సర్టిఫికెట్లను ప్రదానం చేసింది. అకాడమీలో నిర్వహిస్తున్న శిక్షణ, పర్యావరణం, వాతావరణం, ఆహార భద్రత ప్రమాణాలపై హెచ్‌వైఎం తనిఖీలు నిర్వహించింది. దేశంలో తొలిసారి ఒక పోలీస్ అకాడమీకి ఈ తరహా అవార్డులు వచ్చాయి.

# భారత్- మాల్దీవుల వివాదం



### చైనా పరోక్ష ప్రమేయం

- రాజకీయాల్లో చైనాది ఒక వైవిధ్య వ్యూహం. ఆర్థిక సమస్యలతో కునారిల్లుతున్న దేశాలకు భారీగా అప్పులు ఇవ్వడం, ప్రతిఫలంగా ఆ దేశ విదేశాంగ విధానాలు, భౌగోళిక అనుకూలతలను తనకు అనుకూలంగా ప్రభావితం చేస్తూ బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్, స్ట్రింగ్ ఆఫ్ పెర్ల్స్ వంటి తన నెట్‌వర్క్ ద్వారా రాజకీయ, భౌగోళిక ఆధిక్యతను విస్తరించుకుంటూ పోవడం ఈ వ్యూహంలో భాగాలు.
- ముఖ్యంగా స్థానికంగా తన ఆధిపత్యానికి అడ్డుగా నిలుస్తున్న భారత్‌ను అష్టదిగ్బంధనం చేయడం చైనా విదేశాంగ నీతిలో కీలక అంశం. ఇప్పటికే చుట్టుపక్కల పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ వంటి భారత సరిహద్దు దేశాలను తన అప్పుల ఉచ్చులోకి లాగి విదేశాంగ విధానాన్ని తన కనుసన్నుల్లోకి తెచ్చుకుంది. కొన్ని దేశాలకు తత్వం బోధపడినా తాకట్టు నుంచి తప్పుకోలేని పరిస్థితి.
- ఇప్పుడు తాజాగా.. భారత్‌కు చిరకాల మిత్ర దేశం అయిన మాల్దీవులు కొన్నేండ్లుగా చైనా చేతిలో కీలుబొమ్మ అయ్యింది. భారత్‌కు దూరం జరుగుతూ బహిరంగ ప్రకటనలు చేస్తూ, భారత్‌తో సత్సంబంధాలను తృణీకరిస్తుంది. దీనికి ఇటీవల కొద్ది కాలంగా చోటుచేసుకున్న ఉదంతాలే దృష్టాంతాలు.

**అవి...**

1. చిరకాలంగా భారత్‌తో సత్సంబంధాలు సాగిస్తున్న మాల్దీవుల విదేశాంగ విధానంలో 'ప్రోగ్రెసివ్ పార్టీ ఆఫ్ మాల్దీవ్స్ (పీపీఎం)' నాయకుడు అబ్దుల్లా యామీన్ పరిపాలనా కాలం నుంచి (2013–18) చైనా వైపు మొగ్గు చూపడం మొదలైంది. ఈయన కాలంలోనే చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌లో మాల్దీవులు భాగమైంది. 2018లో అధికారంలోకి వచ్చిన ఇబ్రహీం మొహమ్మద్ సోలిహ్ నాయకత్వంలోని 'మాల్దీవియన్ డెమోక్రటివ్ పార్టీ' పాలనా కాలంలో ఇండియా ఫస్ట్ అనే విదేశాంగ విధానాన్ని అనుసరించారు. డిఫెన్స్, భద్రత, సైనిక శిక్షణ, ఆర్థిక రంగాల్లో భారత్‌తో విస్తృత ఒప్పందాలను చేసుకుని బలమైన సంబంధాలు ఏర్పర్చుకున్నారు. దీన్ని అక్కడి విపక్షాలు భారత్ దళాలను దేశంలోకి ఆహ్వానించి దేశ సార్వభౌమత్వాన్ని సోలిహ్ దెబ్బ తీస్తున్నారని విమర్శించడం ప్రారంభించాయి. సోలిహ్ ప్రభుత్వం భారత్‌తో ఉథురు థిలా ఫల్హు (యూటీఎఫ్) ఒప్పందాన్ని 2021లో నేషనల్ డిఫెన్స్ ఫోర్స్ కోస్ట్‌గార్డ్ హార్బర్ సంయుక్త అభివృద్ధి నిమిత్తం ఏర్పర్చుకోవడంతో ఈ విమర్శలు మరింత ఉధృతం చేసిన విపక్షాలు భారత వ్యతిరేక ఉద్యమాన్ని లేవదీశాయి. 2023 ఎన్నికల్లో విపక్ష పీపీఎం పార్టీ నాయకుడు మొహమ్మద్ ముయిజ్జు గతంలో అబ్దుల్లా యామీన్ అనుసరించిన భారత వ్యతిరేక విధాన ధోరణిని అనుసరిస్తూ ఇండియా ఔట్ నినాదాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలో సైతం చేర్చి అధికారంలోకి వచ్చారు.
2. ముయిజ్జు ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే భారత వ్యతిరేక విధానాలు పట్టాలెక్కాయి. ప్రమాణ స్వీకారం చేసిన 24 గంటల్లోనే ఆయన భారత దళాలను తమ దేశం విడిచి వెళ్లాల్సిందిగా కోరారు. నిజానికి మాల్దీవుల్లో ఉన్న భారత దళాలు గస్తీ నౌకలు, విపత్తు సహాయక హెలికాప్టర్ సిబ్బంది, విపత్తు ప్రతిస్పందన, వైద్య సహాయక బృందాలు. అవి కొన్ని సంవత్సరాలుగా వందల కొద్దీ సహాయక చర్యల్లో పాల్గొని మాల్దీవుల ప్రజలకు విపత్తు, వైద్య సహాయం అందిస్తున్నాయి. వాటిని సైనిక దళాల లాగా చూపిస్తూ ముయిజ్జు చేసిన ప్రకటన భారత్ వ్యతిరేక ఎజెండాలో భాగమైంది.
3. ముయిజ్జు దేశాధ్యక్షుడు అయ్యాక తన తొలి పర్యటనలో టర్కీ, చైనాలకు ప్రాధాన్యం ఇచ్చారు. గత అధ్యక్షుల వలే ముయిజ్జు తన తొలి పర్యటనలో భారత్‌కు ప్రాధాన్యం ఇవ్వలేదు.
4. మాల్దీవుల్లో భారత్ చేపడుతున్న హైడ్రోగ్రఫీ ప్రాజెక్ట్ ఒప్పందం 2024 జూన్‌లో తిరిగి రెన్యువల్ కావాలి. కానీ మాల్దీవులు దీనికి సుముఖంగా లేదని ముయిజ్జు ప్రకటించారు. భారత సర్వే నౌకలను వెనక్కి పంపనున్నారు. నిజానికి ఈ హైడ్రోగ్రఫీ సర్వే నిఘా, రక్షణ, వ్యూహాత్మక అవసరాలు, సముద్రయాన భద్రత, పర్యావరణ పరిరక్షణపరంగా ఇరుదేశాలకు కీలకం. అయితే ప్రస్తుతం చైనా తన చుట్టుపక్కల హిందూ సముద్ర ప్రాంతం (ఐవోఆర్)లో భారీగా చేపడుతున్న ఈ తరహా మెరైన్ సర్వేలు మాల్దీవులకు భారత స్థానంలో విస్తరించనున్నది.
5. తాజా వివాదం విషయానికి వస్తే.. మోదీ లక్షదీవుల పర్యటన ఫొటోలను జనవరి 5న సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. లక్షదీవులకు పర్యాటకాన్ని పెంచే ప్రయత్నం చేశారు. అయితే మాల్దీవుల ప్రస్తావన ఎక్కడా లేనప్పటికీ ఆ దేశ సోషల్ మీడియాలో మోదీ లక్షదీవుల పర్యటన, మాల్దీవుల పర్యాటకాన్ని దెబ్బతీసేందుకేనని ప్రచారం జరిగింది.

- మాల్దీవుల ప్రభుత్వంలోని యువజన మంత్రిత్వ శాఖకు చెందిన ముగ్గురు డిప్యూటీ మంత్రులు మాల్షా షరీఫ్, మరియమ్ షివున, మహజూమ్ మాజిద్ మోదీ పై, భారత పర్యాటక రంగంపై, భారతీయుల పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు.
- దీంతో భారతదేశ నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందించారు. 'బాయ్‌కాట్ మాల్దీవ్స్' అనే హ్యాష్ ట్యాగ్‌తో మాల్దీవుల పర్యటనకు వెళ్లవద్దని కోరడం మొదలుపెట్టారు. కొద్ది గంటల్లోనే ప్రముఖులు, సినీ తారలు, క్రీడాకారులు పెద్ద ఎత్తున మద్దతు పలికారు. రోజుల వ్యవధిలోనే భారత సందర్శకులకు చెందిన కొన్ని వేల విమాన, హోటల్ బుకింగ్స్ రద్దయ్యాయి. ఈజ్ మై ట్రిప్ ట్రావెల్ ఏజెన్సీ మాల్దీవులకు బుకింగ్‌లు తీసుకోవడం ఆపేసింది.
- ఇదే సమయంలో మాల్దీవుల అధ్యక్షుడు చైనాలో పర్యటిస్తుండటం, చైనాతో దాదాపు ఇరవై ఒప్పందాలు (రక్షణ, పర్యావరణం, సముద్ర అంతర్భాగ సర్వే, అవస్థాపన సౌకర్యాలు మొదలైనవి) చేసుకోవడంతో మాల్దీవుల వైఖరి సుస్పష్టం చేసినట్లయ్యింది. పైగా చైనా పర్యాటకులు తమ దేశానికి మరింత మంది వచ్చేలా చూడమని మాల్దీవుల అధ్యక్షుడు చైనాను కోరారు. దీంతో మాల్దీవుల ప్రభుత్వ వైఖరి అవగతమైన భారత ప్రభుత్వం లక్షదీవుల పర్యాటకాన్ని పెంచేందుకు అక్కడ ఒక నూతన ఎయిర్‌పోర్ట్, మరిన్ని అవస్థాపన సౌకర్యాలకు ఏర్పాటు చేయ తలపెట్టింది. ఇది కేవలం మాల్దీవులకు ప్రతి సమాధానంగానే కాకుండా, భౌగోళిక వ్యూహాత్మక, భవిష్యత్తులో ఆస్కారం ఉన్న సవాళ్లను ఎదుర్కొనే వ్యూహంతో 9 డిగ్రీల చానెల్ ప్రాంతంలో భారత్ తన పట్టును విస్తరించే వ్యూహంతో ఈ చర్య చేపట్టింది.
- టాటా హోటల్స్ వంటి ఆతిథ్యరంగ సంస్థలు తమ సేవలను లక్షదీవుల్లో విస్తరించనున్నట్లు ప్రకటించాయి. దేశ వ్యాప్తంగా లక్షదీవుల పర్యాటకానికి మద్దతు పెరిగింది. మాల్దీవుల జీడీపీలో 25 శాతం, విదేశీ మారకంలో 60 శాతం టూరిజం నుంచే లభిస్తుంది. అంత ప్రాముఖ్యం గల పర్యాటక రంగంలో దాదాపు 10 శాతం పర్యాటకులు భారతీయులే. దీంతో మాల్దీవుల టూరిజం ఆపరేటర్లు జరుగుతున్న, జరగబోయే నష్టాల్ని గమనించి భారతీయులను క్షమాపణ కోరారు. మాల్దీవుల ప్రభుత్వంపై కూడా వివిధ రంగాలు, విపక్షాలు, ప్రజల నుంచి ఒత్తిడి పెరిగింది. మాల్దీవుల అధ్యక్షుడిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెడతామని ప్రతిపక్షం ప్రకటించింది. దీంతో మాలి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలను ప్రారంభించింది. విమర్శలు చేసిన డిప్యూటీ మంత్రులను పదవుల నుంచి తొలగించి వారి చర్యలతో ప్రభుత్వానికి సంబంధం లేదని ప్రకటించింది.
- ఈ వివాదం నేపథ్యంలో భారత్–మాల్దీవుల మధ్యగల సంబంధాలు, ఇరుదేశాలకు సత్సంబంధాలు నెలకొల్పుకోవాల్సిన ఆవశ్యకతలు చర్చనీయం అయ్యాయి.
- తొలిగా మాల్దీవుల విషయం పరిశీలిస్తే మాల్దీవులకు చిరకాలంగా అనేక విధాలుగా సహాయపడుతున్న భారత్‌తో స్నేహం వాంఛనీయమే.
- మాల్దీవులు 1965లో బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం పొందినప్పుడు మాల్దీవుల సార్వభౌమత్వాన్ని గుర్తించి విదేశాంగ సంబంధాలను ఏర్పర్చుకున్న తొలి దేశాల్లో భారత్ ఒకటి.
- 1988లో మాల్దీవుల్లో అంతర్గత తిరుగుబాటు తలెత్తినప్పుడు భారత్ 'ఆపరేషన్ కాక్టస్' పేరుతో తిరుగుబాటును అణిచివేయడానికి తోడ్పడింది.
- మాల్దీవుల్లో మంచినీటి కొరతను తీర్చడానికి భారత్ మంచినీటి నౌకలను తరలించి ఆదుకున్నది
- 2004లో సునామీ వల్ల మాల్దీవులు తీవ్రంగా నష్టపోయినప్పుడు ఇండియన్ కోస్ట్‌గార్డ్ హెలికాప్టర్లు, ఎయిర్‌ఫోర్స్ విమానాలు, నౌకాదళ సహాయక నౌకలు భారీ ఎత్తున సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. నిత్యావసర వస్తువులు, మందులు, ఆహార పదార్థాలు, నీటిని తరలించాయి.
- కరోనా కాలంలో భారత్ మాల్దీవులకు సుమారు రూ.800 కోట్ల విలువైన వ్యాక్సిన్లను అందించింది.
- మాల్దీవుల్లో తాగునీటి నిర్వహణ, వైద్యం, విద్య, పారిశుద్ధ్యం, అవస్థాపనల ఏర్పాటు, అంతర్జాతీయ విమానాశ్రయ నిర్వహణ, స్టార్ హోటల్స్ స్థాపన వంటి అనేక విషయాల్లో భారత సంస్థలు, వ్యాపార వర్గాల పాత్ర ఎంతో ఉంది
- భారతదేశం నుంచి అత్యధికంగా టూరిస్టులు మాల్దీవులకు వెళ్లడం ఏటా పెరుగుతుంది. ఆ దేశ పర్యాటకంలో మిగతా దేశాలతో పోలిస్తే భారత్ వాటానే అత్యధికం. 2023లో భారతదేశం నుంచి 2,09,198 మంది పర్యాటకులు మాల్దీవులను సందర్శించారు.
- 2009లో విదేశీ మారక నిల్వల సంక్షోభం తలెత్తి మాల్దీవుల మాల్దేవియన్ మానిటరీ ఆధారిత (ఎంఎంఏ), ట్రెజరీ బాండ్లను విడుదల చేసినప్పుడు ఎస్‌బీఐ మొత్తం బాండ్లను (200 మిలియన్ డాలర్లు) సబ్‌స్క్రైబ్ చేసి ఆ సంక్షోభం నుంచి బయటపడేసింది.
- అనేక అంతర్జాతీయ వేదికలపై, పర్యావరణ సదస్సుల్లోనూ మాల్దీవులకు భారత్ ఎప్పుడు మద్దతు ప్రకటిస్తూనే ఉంది. వాతావరణ మార్పుల కారణంగా మునిగిపోతున్న మాల్దీవుల సహాయార్థం పారిశ్రామిక దేశాలు చేయాల్సిన ఆర్థిక సహాయ సహకారాల విషయంలో కాప్ వంటి వేదికలపై మాల్దీవుల వంటి దేశాల తరపున భారత్ పోరాడుతుంది.
- సముద్ర గస్తీ, పర్యావరణ అంచనాలు, వాతావరణ హెచ్చరికలు, అత్యవసర వైద్య సహాయం, విపత్తు ప్రతిస్పందన వంటి అంశాల్లో మాల్దీవులకు భారత్ ఎంతో సహాయం చేసింది.
- అదేవిధంగా మాల్దీవులతో సత్సంబంధాలు భారత్‌కు కూడా చాలా కీలకం.
- భారత పశ్చిమ తీరానికి కేవలం 300 నాటికల్ మైళ్ల దూరంలో, అదే మినికాయ్ దీవుల నుంచి అయితే 70 నాటికల్ మైళ్ల దూరంలో మాల్దీవులు ఉన్నాయి. ఇండియన్ ఓషన్ రీజియన్‌లో మాల్దీవుల భౌగోళిక స్థానం చాలా కీలకమైంది. ఈ ప్రాంతంలో చైనా ఆధిపత్యం సాధించాలని వ్యూహాలు పన్నుతున్న ఈ సమయంలో మాల్దీవులతో చెలిమి భారతకు కలిసి వచ్చే అంశమే.
- మాల్దీవులు భౌగోళికంగా మలక్కా జలసంధి, గల్ఫ్ ఆఫ్ ఏడిన్ మధ్యగల కీలక సముద్రయాన మార్గాల్లో ఉండటం వల్ల భారతదేశ విదేశీ వాణిజ్యంలో దాదాపు సగభాగం, చమురు దిగుమతుల్లో సుమారు 80 శాతం ఈ ప్రాంతం నుంచే తరలిస్తున్నారు. దీంతో మాల్దీవులు ఒక టోల్‌గేట్‌గా వ్యవహరించబడుతుంది.
- చైనా హైడ్రోగ్రఫీ షిప్‌లు ఈ ఐవోఆర్ రీజియన్‌లో విస్తృతంగా సర్వే చేస్తూ ఇప్పటికే భారతదేశం చుట్టూ శ్రీలంక వంటి దేశాల ప్రాదేశిక జలాల్లో సైతం స్థావరం ఏర్పర్చుకుని జలాంతర్గత సముద్ర తీరంలో ఆనుపానులు పసిగడుతూ, కీలక సమాచారం సొంతం చేసుకుంటుంది. మాల్దీవుల్లో ఇలాంటి సర్వే చేస్తున్న భారత సర్వే నౌక స్థానంలో మాల్దీవులు చైనాను ఆహ్వానించడం భారతదేశ తీర భద్రతకు, నౌకాదళ రక్షణ, వ్యూహాత్మక ప్రయోజనాల పరంగా కూడా ఆందోళన కలిగించే అంశం.
- భారతదేశానికి అనుకూల వాణిజ్య శేషం ఉన్న దేశాల్లో మాల్దీవులు ఒకటి. 2021లో భారతదేశం నుంచి 416 మిలియన్ డాలర్ల ఎగుమతులు మాల్దీవులకు చేరగా, మాల్దీవుల నుంచి 48.8 మిలియన్ డాలర్ల ఎగుమతులు మాత్రమే భారత్‌కు వచ్చాయి. ఈ విధంగా దాదాపు 90 శాతం వాణిజ్య శేషం భారత్‌కు అనుకూలంగా ఉంది.
- 'నైబర్ ఫస్ట్' అనే భారతీయ విదేశాంగ విధానంలో భాగంగా ఇప్పటివరకు మాల్దీవులకు అనేక మానవతా సహాయాల పరంగా, వాణిజ్య పెట్టుబడుల పరంగా భారీగా వెచ్చించింది. అంతేకాకుండా ప్రస్తుత ప్రభుత్వం మినహా ఇంతవరకు ఉన్న ప్రభుత్వాలు చాలా వరకు భారత్‌తో సత్సంబంధాలను కొనసాగిస్తూ వచ్చాయి. ఒక రాజకీయ పార్టీ భావజాలం, ఆ దేశంతో చిరకాలంగా నెలకొన్న సత్సంబంధాలను దెబ్బతీయడానికి కారణం కారాదు.
- ఇప్పటివరకు అంతర్జాతీయ వేదికలపై మాల్దీవులు భారత్‌కు మద్దతుగా నిలుస్తూ వచ్చింది.
- ఈ నేపథ్యంలో భారతదేశం మాల్దీవులతో సంబంధాల విషయంలో మరింత ఆచితూచి వ్యవహరించాలి. ఒక పక్క లక్షదీవులను అభివృద్ధి చేస్తూ 9 డిగ్రీల చానెల్ ప్రాంతంలో భారత ప్రాదేశిక జలాల్లో భారత్ తన పట్టును పెంచుకుంటూ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూనే మాల్దీవులతో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. లేని పక్షంలో ఇప్పటికే చైనా 'బెల్ట్ అండ్ ఇనిషియేటివ్' స్ట్రింగ్ ఆఫ్ పెర్ల్స్‌లో భాగమయ్యి చైనా అప్పుల వలలో చికుకున్న మాల్దీవులు మనకు సమస్యాత్మకంగా పరిణమించే అవకాశం ఉంది.
- అదేవిధంగా మాల్దీవులు తన దిద్దుబాటు చర్యలకు మరింత విస్తరించి, చిరాకల శ్రేయోభిలాషి అయిన భారత్‌తో సత్సంబంధాలు నెలకొల్పుకోవల్సిన అవసరం ఉంది. లేకపోతే పాకిస్థాన్, శ్రీలంక లాగా మాల్దీవులు కూడా చైనా చేతిలో తీవ్ర దోపిడీకి గురికాక తప్పదు.

**మల్లవరపు బాలలత**
సివిల్స్ ఫ్యాకల్టీ
సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ,
హైదరాబాద్

